సాక్షి చిత్తూరు

మంగళవారం । 9 । మే । 2023



వాన.. వరద

జీడీనెల్లూరు నియోజకవర్గంలో ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొటెత్తాయి. -8లో



స్వర్ణరథంపై వరసిద్ధుని విహారం

కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి సతీసమేతంగా సోమవారం రాత్రి స్వర్ణరథంపై మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. -8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	37	25
తిరుపతి	38	25
తిరుమల	34	21
గూడూరు	39	27
నగరి	39	26

న్యూస్‌రీల్

రెండు మండలాలుగా చిత్తూరు

- తుది ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు మండలాన్ని రెండు విభజిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం తుది ఉత్తర్వులు జారీచేసింది. ఆ ఉత్తర్వుల మేరకు ఇకపై చిత్తూరు అర్బన్, రూరల్ మండలాలుగా కొనసాగనుంది. తక్షణం ఆ ఉత్తర్వులు అమలుచేయాలని ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు కలెక్టర్ చర్యలు చేపట్టాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఉమ్మడి చిత్తూరు జిల్లా పునర్వ్యవస్థీకరణ తర్వాత నూతన చిత్తూరు జిల్లా పరిధిలో 31 మండలాలున్నాయి. చిత్తూరు రూరల్ మండలం ఏర్పాటు కావడంతో ఇకపై జిల్లాలో 32 మండలాలుంటాయి. నూతన ఉత్తర్వుల ప్రకారం చిత్తూరు అర్బన్ మండలం పరిధిలోకి 15 రెవెన్యూ గ్రామాలు, చిత్తూరు రూరల్ మండలం పరిధిలోకి 26 రెవెన్యూ గ్రామాలు ఉంటాయి. కొత్తగా ఏర్పాటు అయిన రూరల్ మండలానికి తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో, ఇతర మండల అధికారులను, ప్రత్యేక కార్యాలయాలను జిల్లా అధికారులు ఏర్పాటు చేయనున్నారు. గతంలో టీడీపీ ఇచ్చిన హామీని ప్రస్తుతం వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం చేసి చూపించిందని చిత్తూరు వాసులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి కల్చరల్: ఇండియన్ నేవీలో షార్ట్ సర్వీస్ కమిషన్ ఆఫీసర్ ఉద్యోగాలకు అర్హులైన అవివాహిత మహిళలు, పురుషుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్విన్ సీఈఓ డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు. తొమ్మిది బ్రాంచిలలో వివిధ క్యాడర్లలో అండర్ గ్రాడ్యుయేట్, డిగ్రీ చేసిన అభ్యర్థులు అర్హులని, అయితే కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండాలని, ఫైనల్ ఇయర్ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు ముందుగా అధికారిక పోర్టల్ www.joint indianavy.gov.in ను విజిట్ చేసి హోం పేజీలోకి అక్కడ అవసరమైన వివరాలతో రిజిస్టర్ అవ్వాలని, తర్వాత లాగిన్ అయి అప్లికేషన్ పూర్తి చేయాలని తెలిపారు. చివరిగా అప్లికేషన్ ఫీజు చెల్లించి దరఖాస్తు ఫారంను సబ్మిట్ చేయాలని సూచించారు. పదేళ్ల పాటు షార్ట్ సర్వీస్ కమిషన్ ఆఫీసర్‌గా సేవలందించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విదేశీ విద్యాదీవెనకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : జగనన్న విదేశీ విద్యా దీవెన పథకానికి ఎస్సీ విద్యార్థులు ఈ నెల 31వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సాంఘిక సంక్షేమశాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి నరసింహులు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 2022–23 విద్యాసంవత్సరానికి సంబంధించి విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించాలనుకునేవారు ఈ పథకం ద్వారా లబ్ధి పొందవచ్చన్నారు. ప్రభుత్వం గుర్తించిన 21 సబ్జెక్టుల్లో ప్రపంచంలోని టాప్ 50 విదేశీ విద్యాసంస్థల్లో చదువాలనుకునే విద్యార్థులకు ఆర్థికసాయం అందిస్తామని వెల్లడించారు. అర్హులైనవారు www.jnanabhumi.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

10న పాలిసెట్-2023

కుప్పం: డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి ఈనెల 10వ తేదీన పాలిసెట్–2023 నిర్వహించనున్నట్లు వైసీజేమ్స్ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ జగన్నాథరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పాలిసెట్‌కు మొత్తం 546 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. సాంకేతిక సమస్యల వల్ల హాల్ టికెట్లు ఆన్‌లైన్‌లో రాకపోతే, విద్యార్థులు వెంటనే పాలిటెక్నిక్ కళాశాలలో సంప్రదించాలని సూచించారు. హాల్ టికెట్ల కోసం పాలిసెట్ రిజిస్ట్రేషన్ ఫారం, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, పరీక్షకు చెల్లించాల్సిన ఫీజుతో రావాలని తెలిపారు. వివరాలకు 9912342101 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

పీజీటీ పోస్టులకు అంగీకార పత్రాలు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అప్‌గ్రేడ్ హైస్కూల్ ప్లస్‌లో పీజీటీ పోస్టులు భర్తీ చేయనున్నట్లు డీఈఓ విజయేంద్రరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆయా పాఠశాలల్లో పనిచేసేందుకు స్కూల్ అసిస్టెంట్లు అంగీకార పత్రాలు అందజేయాలని సూచించారు. అర్హులైన స్కూల్ అసిస్టెంట్లు సంబంధిత డీవైఈఓ కార్యాలయాల్లో అంగీకారపత్రాలను సమర్పించాలని కోరారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

చిత్తూరు అగ్రికల్చర్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించాలని డీఆర్‌డీఏ పీడీ తులసి ఆదేశించారు. సోమవారం డీఆర్‌డీఏ సమావేశ భవనంలో వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సామాజిక పింఛన్లు, చేయూత, ఆసరా, కళ్యాణమస్తు, గృహ నిర్మాణం తదితర పథకాలకు అర్హులను గుర్తించడంలో క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలన్నారు. సచివాలయాలకు ప్రజల నుంచి వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు. ఏపీడీ రవికుమార్ పాల్గొన్నారు.

ఖరీఫ్.. రిలీఫ్!

వరుణుడి కరుణతో అన్నదాత సాగుకు సన్నద్ధమవుతున్నాడు.. వేసవిలోనూ సమృద్ధిగా వర్షాలు కురుస్తుండడంతో ఖరీఫ్ సేద్యానికి సర్వం సిద్ధం చేసుకుంటున్నాడు.. వాతావరణ పరిస్థితులు వ్యవసాయానికి అనుకూలంగా ఉండడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నాడు.. ఈ క్రమంలోనే ప్రభుత్వం సైతం రైతాంగానికి అండగా నిలుస్తోంది.. ఏపీ సీడ్స్ ద్వారా శుద్ధి చేసిన విత్తనాలను అవసరాలకు తగ్గట్టు అందుబాటులోకి తీసుకువస్తోంది.. ఈమేరకు రైతుభరోసా కేంద్రాలకు విత్తనాలను తరలిస్తోంది.. ముందస్తుగా దరఖాస్తు చేసుకున్న వారికి రాయితీపై పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తోంది.

- విత్తనాలను సిద్ధం చేసిన ప్రభుత్వం
- ముందస్తుగా పంపిణీకి సన్నద్ధం
- అందుబాటులో 45,817 క్వింటాళ్లు
- దరఖాస్తు చేసిన రైతులందరికీ రాయితీపై అందజేత

సోమల రైతు భరోసా కేంద్రానికి చేరుకున్న వేరుశనగ విత్తనకాయలను పరిశీలిస్తున్న అధికారులు



మేలుపట్ల రైతు భరోసా కేంద్రానికి చేరుకున్న విత్తనకాయల పరిశీలనలో అధికారులు



సాక్షి, చిత్తూరు : జిల్లావ్యాప్తంగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. దుక్కులు దున్నుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నార. ఈక్రమంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు సైతం ముందస్తుగానే విత్తనాలు పంపిణీ చేసేందుకు కార్యాచరణ అమలు చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో సాగుకు అవసరమైన 46,817 క్వింటాళ్ల విత్తనాలను ఇప్పటికే సిద్ధం చేశారు. ఆయా ఆర్‌బీకేల్లో దరఖాస్తు చేసుకున్న రైతులకు 40శాతం సబ్సిడీతో విత్తనాలు అందించనున్నట్లు వెల్లడిస్తున్నారు.

వేరుశనగ విత్తనకాయలు రెడీ!

వేరుశనగ పంట సాగుకు ఇదే అదనుగా అధికారులు నిర్ణయించారు. ఇప్పుడు విత్తుకుంటే నవంబర్ కంటే ముందే పంట చేతికొస్తుందని అంచనా వేశారు. అందువల్ల వర్షాకాలంలో తుపాన్ల బెడద నుంచి పంటను కాపాడుకోవచ్చని సూచిస్తున్నారు. అందుకే వేరుశనగ సాగుకోసం మొత్తం 39,600 క్వింటాళ్ల విత్తనకాయలు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఆ మేరకు కే6 రకానికి చెందినవి 38,550 క్వింటాళ్లు, నారాయణి రకం 1,050 క్వింటాళ్లను సిద్ధం చేశారు. అనంతరం ఏపీ సీడ్స్ ద్వారా శుద్ధి చేసిన విత్తనకాయలను జిల్లాలోని మొత్తం 502 రైతుభరోసా కేంద్రాలకు చేరుస్తున్నారు. విత్తన కాయలు క్వింటాల్ రూ.9,300 పలుకుంటే, దరఖాస్తు చేసుకున్న రైతులకు రూ.3,720 సబ్సిడీ పోను రూ.5,580లకే అందించాలని నిర్ణయించారు.

చిరుధాన్యాలు సిద్ధం

ఖరీఫ్‌కు సంబంధించి చిరుధాన్యాల సాగు కోసం 7,217 క్వింటాళ్ల విత్తనాలను వ్యవసాయశాఖ అధికారులు సిద్ధం చేశారు. అందులో కందులు 290 క్వింటాళ్లు, రాగి-160, పెసలు-36, ఉలవలు వెయ్యి క్వింటాళ్లను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ విత్తనాలను కూడా ఎప్పటి ప్పుడు రైతు భరోసా కేంద్రాలకు తరలిస్తున్నారు.



సకాలంలో సాగు



వర్షాలు పుష్కలంగా కురుస్తున్నాయి. దీంతో సకాలంలో సాగు చేపడుతున్నాం. నీటి సమస్య లేకపోవడంతో పొలాలను సిద్ధం చేసుకుంటున్నాం. వేరుశనగ విత్తనకాయలను ప్రభుత్వం ముందుగానే పంపిణీ చేయాలని నిర్ణయించడం ఆనందంగా ఉంది. ఇప్పుడు సాగు చేస్తే తుపానుల నుంచి తప్పించుకునే అవకాశముంటుంది. మంచి దిగుబడి పొందే వెసులుబాటు వస్తుంది.

– ఎం.సుబ్రమణ్యం రైతు, పాతపేట, పుంగనూరు,

అధిక దిగుబడికి అవకాశం



జిల్లాలో వేరుశనగను వర్షాధారంతోనే సాగు చేస్తుంటారు. మూడేళ్లుగా వరుణుడి కరుణతో రైతులు మంచి దిగుబడి సాధించారు. ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి ప్రభుత్వం ముందుగానే విత్తనాల సేకరణ చేపట్టింది. అందుకు అనుగుణంగా వర్షాలు పడుతుండడంతో వేరుశనగ సాగు ప్రారంభిస్తే అధిక దిగుబడికి అవకాశముంటుంది. త్వరలోనే విత్తనకాయల పంపిణీ ప్రారంభం కానుంది.

– హరి ప్రసాద్, వ్యవసాయాధికారి, పులిచెర్ల మండలం

పనులు ప్రారంభించాం



ప్రభుత్వం ముందస్తుగా విత్తన కాయలు పంపిణీ చేయనుండడంతో ఆనందంగా ఉంది. ఇప్పుడు సాగు మొదలుపెడితే అధిక దిగుబడితోపాటు ఆశాజనకంగా ఆదాయం పొందవచ్చు. వర్షాలు బాగా కురుస్తుండడంతో పొలం పనులు ప్రారంభించాం. ఆర్‌బీకేల నుంచి త్వరలోనే విత్తనాలు అందించనున్నట్లు తెలిసింది. ప్రభుత్వ సహకారంతో సకాలంలో సేద్యం చేయగలుగుతున్నాం.

– కె.నీరజాక్షులు, టి.పుత్తూరు తవణంపల్లె మండలం

రైతులందరికీ విత్తనాలు



జిల్లాలో వేరుశనగ విత్తనాల కాయలతో పాటు కందులు, పెసర్లు, ఉలవలు కూడా పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వేరుశనగ విత్తన కాయల పంపిణీని త్వరలోనే ప్రారంభిస్తాం. 40శాతం సబ్సిడీతో ఇప్పటికే ఆర్‌బీకేల్లో ముందస్తుగా దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ 30కేజీల బస్తాల్లో విత్తనకాయలు అందిస్తాం. అన్నదాతలను ఆదాయమార్గంలోకి తీసుకెళ్లేందుకు పూర్తిగా సహకరిస్తాం. – మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయశాఖాధికారి

ముందస్తు ప్రణాళిక



వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత నిస్తోంది. విత్తనాల సేకరణ నుంచి పంపిణీ వరకు రైతులకు సహకారం అందిస్తోంది. ఈ ఏడాది ముందుగానే వర్షాలు రావడం వల్ల రైతులు వేరుశనగ సాగుకు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. అందుకు తగ్గట్టుగానే విత్తనకాయలను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశాం. పంట దిగుబడి సమయంలో వచ్చే వర్షాలను అధిగమించడానికి ముందస్తు ప్రణాళిక ఉపయోగపడుతుంది.

– షణ్మోహన్, కలెక్టర్, చిత్తూరు

బాబు..లోకేష్ యాత్రలు వృథా



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎంనారాయణస్వామి

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం) : రాజకీయ మనుగడ కోసం చంద్రబాబునాయుడు, నారా లోకేష్, చేస్తున్న యాత్రలు వృథా అని, వారిని జనం నమ్మరని డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. సోమవారం నెల్లేపల్లిలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో ఆయన మాట్లాడారు. ప్రజలను మరోసారి నమ్మించి మోసం చేసేందుకు తండ్రీ కొడుకులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించవన్నారు. 14 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు కంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలోనే ప్రజలకు వందరెట్లు మేలు చేకూరిందని వెల్లడించారు. గడప గడపలో జగన్.. జగన్ నినాదమే వినిపిస్తోందని, చంద్రబాబును ఎవరూ కోరుకోవడం లేదని స్పష్టం చేశారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయాన్ని అడ్డుకోలేరని తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు వెంకటరెడ్డి, ఎంపీపీ అనిత పాల్గొన్నారు.

సకాలంలో సమస్యల పరిష్కారం

– కలెక్టరేట్‌లో స్పందనకు 197 అర్జీలు



అర్జీదారుతో మాట్లాడుతున్న కలెక్టర్



సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ

చిత్తూరు కలెక్టరేట్ : స్పందన కార్యక్రమంలో ప్రజలు వినతుల ద్వారా వెల్లడించే సమస్యలను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్పందనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందన్నారు. సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జేసీ పులి శ్రీనివాసులు, డీఆర్‌ఓ రాజశేఖర్, ట్రైనీ కలెక్టర్ మేఘాస్వరూప్, పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. స్పందనకు వివిధ సమస్యలపై మొత్తం 197 అర్జీలు వచ్చినట్లు లెక్టరేట్ అధికారులు వెల్లడించారు.

పోలీసు స్పందనకు 15 ఫిర్యాదులు

చిత్తూరు అర్బన్: నగరంలోని జిల్లా పోలీసు శాఖ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్పీ రిశాంత్‌రెడ్డి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కొన్ని వినతులను అక్కడికక్కడే పరిష్కరించారు. మొత్తం 15 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

మా ఊరి జాతర

జాతర. రాయలసీమ జిల్లాలో ఊరూరా ప్రతి ఏటా ఘనంగా జరుపుకునే స్థానిక పండుగ. గ్రామస్తులంతా చందాలు వేసుకుని వారం రోజుల పాటు జరుపుకునే ఈ జాతర పురుడు పోసుకుంది తిరుపతిలోనే. సీమ జిల్లాల్లోనే అత్యంత వేడుకగా తిరుపతిలో నిర్వహించే ఈ జాతరను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించింది. తిరుపతి, చిత్తూరులో గంగజాతర జరుపుకునేందుకు నేడు చాటింపు వెయ్యనున్నారు. చాటింపు అంటే.. జాతరకు రమ్మని పిలుపునివ్వడం. అసలు జాతర ఎందుకు చేస్తారు? జాతర ముందు చాటింపు ఎందుకు వేస్తారు? తదితరాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.



దప్పు కొట్టి చాటింపు వేస్తున్న దృశ్యం (ఫైల్)

- ఊరు సరిహద్దుల్లో తోరణాలు.. పొలిమేర పూజలు
- తిరుపతి, చిత్తూరు గంగ జాతరకు నేడు చాటింపు
- చాటింపు వేశారంటే ఎవ్వరూ ఊరు దాటకూడదు
- రాయలసీమలో నేటికీ కొనసాగుతున్న ఆచార, సంప్రదాయాలు

ఢం.. ఢం.. ఢం
ఇది గంగ జాతర చాటింపు
ఊరూవాడా బాగుండాలి
ఎవ్వరూ ఊరు వదిలి
వేరొక ఊరికి వెళ్లకూడదు
జనమంతా ఊరు పొలిమేరల్లోపే
ఉండాలి
చిన్న చిప్పలో ఆముదంతో
దీపం వెలిగించాలి
యముడితో వాదులాడి
దున్నపోతును తేవాలి
శివుడితో వాదులాడి సింహాన్ని తేవాలి.
వచ్చే మంగళ, బుధవారం
గంగజాతరహో..

సాక్షి, తిరుపతి: రాయలసీమ జిల్లాలు నాడు కరువు కాటకాలతో అల్లాడిపోయేవి. వేసవి వచ్చిందంటే గుక్కెడు మంచినీటికీ కరువే. అదే సమయంలో కలరా.. ప్లేగు వంటి వ్యాధులు జనాన్ని భయపెట్టేవి. ఊరు, వాడా తేడాలేకుండా మంచంపట్టేది. పలువురు మృత్యువాతపడేవారు. అటువంటి సమయంలో ఊరు పెద్దలంతా ఏకమై ఒక నిర్ణయానికి వచ్చేవారు. గంగమ్మ తల్లికి పూజలు చేయాలని నిర్ణయించేవారు. అందు కోసం ఒకపెద్ద బండరాయిని తీసుకుని దానిపై 'ఓం లేదా స్వస్తిక్' గుర్తును చెక్కేవారు. అలా చెక్కిన బండకు పసుపు, కుంకుమ పెట్టి వేపాకు చుడుతారు. చాకలి తెచ్చి ఇచ్చే ఒక తెల్లగుడ్డను చుట్టి 'గంగమ్మ తల్లి' అని వారం రోజుల పాటు ప్రత్యేక పూజలు చేసేవారు. అంటు వ్యాధులు ప్రబలకుండా.. వ్యాధులతో బాధపడే వారిని మృత్యువాత నుంచి గట్టెక్కించమని, వర్షాలు సమృద్ధిగా కురవాలని ప్రార్థించేవారు.

చాటింపుతో.. అష్టదిగ్బంధనం

నాడు సెల్‌ఫోన్ సౌకర్యం ఉండేది కాదు. బస్సులు, రైళ్లు అంతంత మాత్రమే. ఇతర ప్రాంతాల్లో ఉన్న ఊరి వాళ్లను గంగ జాతర ప్రారంభమైంది.. రమ్మని పిలిచేందుకు చాటింపు వేసి ఊరుని అష్టదిగ్బంధనం చేస్తారు. జాతర సమయంలో ఏరోజు ఏమి చేయాలో అదే రోజు నిర్ణయిస్తారు. అదెలా అంటే.. మంగళవారం రాత్రి ఊరు పొలిమేరల్లో ప్రత్యేకంగా ముగ్గులు వేసి కొబ్బరికాయ కొట్టి కుంకుమ కలిపిన నిమ్మకాల్ని కోసి నలువైపులా పిండి హారతి ఇస్తారు. గెరిగ ఊరేగింపుగా వెళ్తారు. ఆ గెరిగకు చుట్టూ పసుపు, కుంకుమపెట్టి వేప మండలు చుడుతారు. తోటి వాడి సాయంతో దండోరా వేస్తూ.. జాతర తేదీలను తెలియజేస్తూ ఊరు పొలిమేరల్లో తిరుగుతారు. ఊరుకి నాలుగు పొలిమేర్లలో ప్రత్యేక పూజలు చేసి హద్దు తోరణాలు కట్టి అష్టదిగ్బంధనం చేస్తారు. దుష్ట శక్తులు ఆవహించకుండా..అమ్మవారి జాతర ప్రశాంతంగా జరగాలని పూజలు నిర్వహిస్తారు. ఈ తంతు పూర్తయిన తర్వాత నడివీధిలో గెరిగను పెట్టి సంప్రదాయ పద్ధతిలో పూజలు చేస్తారు. చాటింపు వేసి పొలిమేర్లలో హద్దు తోరణాలు కడితే ఊరుదాటి బయటకు వెళ్లకూడదన్నది ఆచారం. అలా బయటకు వెళితే చెడు జరుగుందని గ్రామ పెద్దలు చెబుతున్నారు.

తిరుపతి, చిత్తూరు హద్దులు ఇవే..

తాతయ్యగుంట గంగమ్మ గుడి (హెడ్ పోస్టాఫీస్ వీధి చివర్లో). చింతకాలయ వీధి, కర్నాలవీధి (కూ డలి), బేరివీధి, గాలివీధి ముందు కూడలి. నేటి రాత్రి చాటింపు వేసే ముందు కైకాలవారు పెద్దకాపు వీధిలో పదిమంది రెడ్లకు చాటింపు విషయాన్ని తెలియజేస్తారు. మొదట బేరివీధి, కర్నాలవీధి మలుపులో ఉన్న పురాతన రాతి మండప ఆలయం ముందు చాటు పూజ చేస్తారు. ఈ రాతి మండపాన్ని 'చాటు మండపం' అని పిలుస్తా రు. రెండు అడుగుల రుబ్బురాయి ఆకారంలో ఉన్న నల్లని శిల (పోతురాజు) మండపం నుంచి వెలుపలకు తీసు కొచ్చి బొట్లుపెట్టి మల్లెపూలతో అలంకరించి రోడ్డుపక్కన ఉంచుతారు. చిత్తూరులో తేనెబండ, సంతపేట శివాలయం, కట్టమంచి చెరువు, గంగినే ని పార్కు వద్ద శక్తిమారియమ్మ ఆలయం హద్దులు.

రాష్ట్ర పండుగగా గంగజాతర

తిరుపతి తాతయ్యగుంట గంగ జాతరను ప్రభుత్వం రాష్ట్ర పండగగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో జరగనున్న ఈ జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. దేవదాయశాఖ, టీటీడీ నిధులతో గంగమ్మ తల్లికి నూతన ఆలయాన్ని నిర్మించి కంచికామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి, విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపనందేంద్రస్వామి చేతుల మీదుగా మహాకుంబాభిషేకం నిర్వహించడం మరో విశేషం.

మంగళవారం మంగళకరం

మంగళవారం రోజు అంటే మంగళకరమైన రోజు అని పెద్దల మాట. అదేవిధంగా గంగమ్మ శక్తి దేవత కావడం.. ఆమెకు మంగళవారం ఇష్టం కనుక అదే రోజు చాటింపు వేస్తారని చెబుతున్నారు. ఊరి బాగు కోసం చేసే కార్యక్రమం దిగ్విజయంగా జరగాలని చాటింపుని మంగళవారం రాత్రి నిర్వహించడం ఆనవాయితీ. సీమ జిల్లాలో ఎక్కడైనా మంగళవారం రాత్రే చాటింపు వేయడం ఆనవాయితీ.

గంగమ్మ పుట్టింటి సారెతో జాతర చాటింపు

గంగమ్మతల్లి పుట్టినిల్లు అయిన అవిలాల గ్రామం నుంచి మంగళవారం రాత్రి తిరుపతిలోని శ్రీతాతయ్యగుంట గంగమ్మకు పుట్టింటి సారె అత్యంత వేడుకగా సాగనుంది. అమ్మవారికి సారె తీసుకొచ్చి గంగమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం జాతర ఉత్సవాల్లో ప్రధా న పాత్రదారులైన కైకాలవారు మంగళవారం అర్ధరాత్రి నగరంలోని చాటు మండపంలో పూజలు నిర్వహించి, నాలుగు దిక్కుల అష్టబంధనం చేసి దప్పుతో నగరంలో జాతర చాటింపు చేయనున్నారు. ఈ చాటింపుతో గంగమ్మ జాతర సంబరాలు ఆరంభం కానున్నాయి.

గ్రామదేవత లేని ఊరు ఎక్కడా ఉండదు



గ్రామదేవతలు లేని ఊరు ఎక్కడా ఉండదు.. చూడలేదు. ఈ దేవతలకు కనీసం సంవత్సరానికి ఒక్కసారైనా పూజలు, తిరునాళ్లు, జాతరలు జరిపిస్తుంటారు. ఈ జాతర 'యాత్ర' అనే శబ్దం నుంచి ఉద్భవించింది. చుట్టుపక్కల ఉండేవారంతా ఒకచోటుకు యాత్రలాగా వెళ్లి ఉత్సవాన్ని జరుపుకోవడమే జాతర. గ్రామదేవతలు వేరైనా వారిని ఆరాధించే విధానంలో కొంత తేడా కనిపించినా బలులు ఇచ్చే విధానం దేశంలోని అన్ని ప్రాంతాల్లో ఇంచు మించు ఒకే విధంగా ఉంటుంది. – శ్రీనివాసులురెడ్డి (పేటశ్రీ), ప్రొఫెసర్, ఎస్వీయూ, తిరుపతి.

మరింత వేగంగా గృహ నిర్మాణాలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో మరింత వేగంగా గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పలుశాఖ అధికారులతో ఆయన సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ సామూహిక గృహప్రవేశాలకు సమయం సమీపిస్తున్నందున త్వరితగతిన పనులు పూర్తి చేయిచాలన్నారు. అలాగే జిల్లావ్యాప్తంగా అభివృద్ధి పనులు, వివిధ శాఖ భవన నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. స్పందనకు వచ్చే అర్జీలకు ప్రాధాన్యమిస్తూ, నిర్ణీత గడువులో బాధ్యతగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. జగనన్న ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి బిల్లులను ఈ నెల 12వ తేదీలోపు అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. స్వయం సహాయక సంఘాలకు రుణాలు మంజూరు చేయాలని తెలిపారు. అమృత్ సరోవర్ పథకంలో గుర్తించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. నాడు–నేడు పనుల్లో పురోగతి కచ్చితంగా ఉండాలని స్పష్టం చేశారు. జేసీ శ్రీనివాసులు, డీఆర్‌ఓ రాజశేఖర్ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

పెద్దపంజాణి: కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరిని సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. మండల సరిహద్దులోని రాజుపల్లె చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేపట్టగా బైక్‌పై శివరాజ్, వినోద్ పట్టుబడినట్లు వెల్లడించారు. నిందితుల నుంచి 196 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

స్వర్ణరథంపై వరసిద్ధుని విహారం


బంగారురథంపై సతీసమేతంగా ఊరేగుతున్న వినాయకస్వామి


గణపతి వ్రతంలో భక్తులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి సోమవారం రాత్రి స్వర్ణ రథంపై మాడ వీధులలో విహరించారు. సంకటహర చతుర్థి గణపతి వ్రతం సందర్భంగా ఆలయ కల్యాణ వేదికలో సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామిని విశేషంగా అలంకరించారు. మంగళవాయిద్యాల నడుమ బంగారు రథంలో కొలువుదీర్చారు. పూజలు చేశారు. ప్రత్యేక పూజల అనంతరం మాడవీధుల్లో కనుల పండువగా ఊరేగించారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, ఇన్‌చార్జి సీఐ భాస్కర్, ఇన్‌చార్జి ఎస్‌ఐ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా వ్రతం

కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో సోమవారం శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి గణపతి వ్రతం నిర్వహించారు. పౌర్ణమి తర్వాత నాలుగో రోజున వ్రతం నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా సిద్ధి, బుద్ధి, సమేత వినాయక స్వామి ఉత్సవ మూర్తులను కల్యాణ వేదికలో కొలువుదీర్చారు. వేదపండితులు మంత్రోచ్చారణల నడుమ గణపతి వ్రతం జరిపించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని వ్రతం ఆచరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వెంకటేశు, ఏఈఓ రవీంద్ర బాబు, సూపరింటెండెంట్లు కోదండ పాణి, శ్రీధర్ బాబు పాల్గొన్నారు.



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,200
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,400
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.78,000
రిటైల్ వెండి గ్రాము	రూ.81

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి

గుడిపాల: మండలంలోని చింతగుంటూరు వద్ద సోమవా రం జరిగిన రోడ్డుప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. వివరాలు.. బొమ్మసముద్రం దళితవాడకు చెందిన లవి (47) అనే వ్యక్తి తమిళనాడులోని కాట్పాడి సమీపంలో ఉన్న సన్‌బీమ్ పాఠశాలలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈక్రమంలో లవి తన బావమరిది కార్తీక్‌తో కలిసి కారులో కాట్పాడికి వెళ్లాడు. తిరిగి వస్తుండగా కారు అదుపు తప్పి కరెంట్ స్తంభాన్ని ఢీకొంది. దీంతో లవి అక్కడికక్కడే మరణించాడు. మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగుపాటుకు ఇల్లు ధ్వంసం


ఆవు కళేబరం వద్ద రైతు

బంగారుపాళెం: తగ్గువారిపల్లెలో ఓ ఇంటిపై ఆదివారం రాత్రి పిడుగు పడింది. సుశీలమ్మ అనే మహిళ ఇల్లు పాక్షికంగా ధ్వంసమైంది. ఇంటి గోడలు బీటలు వారి పెచ్చులు ఊడాయి. టీవీ, ఫ్రిజ్, వాషింగ్‌మిషన్ తదితర విద్యుత్ ఉపకరణాలు కాలిపోయాయి. సోమవారం బాధితురాలి ఇంటిని సర్పంచ్ వాణి ప్రియ, తహసీల్దార్ బెన్నురాజ్, వీఆర్‌ఓ పళణి, గ్రామ కార్యదర్శి దుర్గాప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు హేమచంద్ర, షబీనాభాను, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి రఘుపతిరాజు, సురేంద్ర పరిశీలించారు.

ఆవు మృతి

బైరెడ్డిపల్లె : మండలంలోని తీర్థం గ్రామంలో సోమవారం సాయంత్రం పిడుగుపడి ఓ ఆవు మృతి చెందింది. నాలుగురోజుల క్రితం రూ.75వేలు వెచ్చించి ఆవును కొనుగోలు చేశానని, మేతకోసం పొలం వద్దకు తీసుకెళ్లితే పిడుగు పాటుకు మరణించిందని రైతు కె.గోవిందప్ప ఆవేదన వ్యక్తం చేశాడు.

వాహనం ఢీకొని జింక మృతి


జింక కళేబరం

చిత్తూరు కార్పొరేషన్: కలెక్టరేట్ సమీపంలోని రెడ్డిగుంట వద్ద సోమవారం సాయంత్రం రోడ్డు దాటుతున్న జింకను గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో జింక అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న ఎఫ్‌బీఓ గణేష్‌బాబు వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్నారు. జింక కళేబరాన్ని అటవీప్రాంతంలో దహనం చేయనున్నట్లు వెల్లడించారు.

అగ్నిప్రమాదస్థలంలో మృతదేహం


కాలిపోయిన యువకుడి మృతదేహం


షాధిక్‌ను విచారిస్తున్న ఆర్డీఓ రేణుక (ఫైల్)


అగ్నిప్రమాద దృశ్యం (ఫైల్)

- శిథిలాల నుంచి దుర్వాసన
- పోలీసులకు సమాచారం ఇచ్చిన స్థానికులు
- ఐదు రోజుల తర్వాత వెలుగులోకి..

చిత్తూరు అర్బన్/చిత్తూరు కలెక్టరేట్ : నగరంలో ఐదు రోజుల క్రితం ఓ సోఫా తయారీ కేంద్రంలో అగ్నిప్రమాదం సంభవించిన ఘటన విధితమే. ఈ క్రమంలో సోమవారం ఘటనాస్థలంలో ఓ యువకుడి మృతదేహం వెలుగు చూసింది. మృతుడికి సుమారు 17–20 ఏళ్లు ఉంటుందని వైద్యులు నిర్ధారించారు. దీనిపై సోఫా తయారీ కేంద్రం యజమాని షాధిక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో షాధిక్ నోరు విప్పక పోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

అన్నీ అనుమానాలే..

ఏడాది క్రితం షాధిక్ సోఫా తయారీ కేంద్రాన్ని ప్రారంభించాడు. అగ్నికి ఆహుతయ్యే ఫోమ్, దూది, టెంకాయ నారతో పాటు పలు వస్తువులను పెద్ద మొత్తంలో నిల్వచేసినా ఇతను అగ్నిమాపక శాఖ నుంచి ఎలాంటి అనుమతులు కూడా తీసుకోలేదు. ప్రమాద సమయంలో రూ.కోటి వరకు నష్టం వాటిల్లినట్లు చెప్పిన షాధిక్, తన దుకాణానికి కనీసం ఇన్సూరెన్సు కూడా చేయించలేదు. షాపులో పనిచేసేందుకు ఉత్తరప్రదేశ్ నుంచి ఏడుగురిని తీసుకు వచ్చానని చెబుతున్నా, ఎక్కడా వారి వివరాలను నమోదు చేయలేదు. ప్రమాదం సంభవించిన రోజు ఓ పక్క అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తుంటే, షాధిక్ మాత్రం ఏమీ ఎరగనట్లు వెళ్లి పోవడం పలు అనుమానాను రేకెత్తిస్తోంది. ఈ క్రమంలో తాజాగా ప్రమాదం జరిగిన స్థలంలో యువకుడి మృతదేహం బయటపడటంతో పోలీసుల చూపు షాధిక్ వైపు మళ్లింది. ప్రమాదం జరిగిన రోజున సిబ్బంది అందరూ క్షేమంగా బయటపడ్డారని షాధిక్ వాంగ్మూలం ఇచ్చాడు. ఇప్పుడు మృతదేహం వెలుగు చూడడంతో దుకాణ యజమాని ఉద్దేశపూర్వకంగానే నిజాన్ని దాచిపెట్టినట్లు స్పష్టమవుతోంది. మృతుడు ఎవరు..? వివరాలు ఏంటి..? అగ్నికీలకల్లో చిక్కుకుని చనిపోయాడా..? ఎవరైనా ఏదైనా చేశారా..? ప్రమాదవశాత్తు చనిపోతే నిజం ఎందుకు దాచినట్లు..? ఇన్ని ప్రశ్నలు పోలీసులను సైతం వేధిస్తున్నాయి. దీనిపై ఎస్పీ రిశాంత్‌రెడ్డి స్పందిస్తూ, ఘటనపై లోతుగా విచారించి, వాస్తవాలను వెలికితీయాలని ఆదేశించారు.

వర్షంతో ట్రాన్స్‌కోకు రూ.10 లక్షల నష్టం


ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

తిరుపతి రూరల్: చంద్రగిరిలో ఆదివారం రాత్రి, సోమవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి విద్యుత్ శాఖకు భారీ నష్టం వాటిల్లింది. వర్షానికి తోడు పిడుగులు పడడంతో చంద్రగిరి, శ్రీకాళహస్తి, బీఎన్ కండ్రిగ, వెదురుకుప్పం, తిరుపతి రూరల్, రేణిగుంట ప్రాంతాల్లో 19కి పైగా ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. రెండు కిలోమీటర్ల మేర విద్యుత్ లైన్లు దెబ్బతిన్నాయి. 35 విద్యుత్ పోల్స్ నేలకూలాయి. తూర్పు మండలాల్లో చాలా ప్రాంతాల్లో సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఎస్పీడీసీఎల్ తిరుపతి సర్కిల్ ఎస్ఈ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో విద్యుత్ సిబ్బంది వర్షంలోనూ యుద్ధప్రతిపాదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు. విద్యుత్ మరమ్మతుల కారణంగా చంద్రగిరితో సహా పలు మండలాల్లో కరెంటు సరఫరా నిలిచిపోయింది. దాదాపు రూ.10 లక్షల వరకు నష్టం వాటిల్లినట్టు విద్యుత్ అధికారులు తెలిపారు.

అర్జీలను సకాలంలో పరిష్కరించండి


అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: స్పందన కార్యక్రమానికి వచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌తోపాటు డీఆర్వో శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కోదండరామిరెడ్డి, భాస్కర్‌నాయుడు, శ్రీనివాసులు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ శ్రీలేఖ తదితరులతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 153 అర్జీలు అందగా అందులో ఒక్క రెవెన్యూశాఖకు సంబంధించిన వినతులే 107 వరకు ఉన్నట్టు కలెక్టర్ తెలిపారు. సంబంధిత అర్జీలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

విద్యుదాఘాతంతో ఉద్యోగికి గాయాలు


గాయపడిన పవన్‌కుమార్

యాదమరి: మండలంలోని జోడిచింతల వద్ద సోమవారం విద్యుదాఘాతానికి గురై ట్రాన్స్‌కో ఉద్యోగి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. గ్రేడ్-2 ఏఎల్ఎం పవన్‌కుమార్ విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తుండగా రిటర్న్ సప్లయ్ రావడంతో కరెంట్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే చిత్తూరు జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యుల సూచన మేరకు వేలూరు సీఎంసీకి తరలించారు. గతంలో కూడా పవన్‌కుమార్ విద్యుదాఘాతానికి గురై తీవ్రగాయాల పాలైనట్లు బంధువులు తెలిపారు.

చెస్‌తో ఏకాగ్రత

- 26 నుంచి తిరుపతిలో రాష్ట్ర స్థాయి ఓపెన్ పోటీలు
- చెస్ అసోసియేషన్ జిల్లా ఛైర్మన్ వెల్లడి


చెస్ పోటీలను ప్రారంభిస్తున్న అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దివాకర్‌రెడ్డి

తిరుపతి రూరల్: చెస్‌తో ఏకాగ్రత పెరుగుతుందని జిల్లా చెస్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం యూత్ హాస్టల్‌లో జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోటీలు జరిగాయి. ఈ పోటీలను చెస్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ దివాకర్‌రెడ్డి ప్రారంభించారు. చిన్నప్పటి నుండే చెస్ క్రీడను అలవర్చుకోవడం వల్ల క్రమశిక్షణ, ఏకగ్రత అలవడుతుందన్నారు. అనంతరం క్రీడాకారులతో కలిసి సరదాగా చెస్ ఆడారు. జిల్లా స్థాయిలో నిర్వహించే ఈ టోర్నమెంట్‌లో మొదటి నాలుగు స్థానాలు సాధించిన పురుషులు, మహిళా క్రీడాకారులకు జిల్లా తరఫున రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. పురుషులకు ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు తిరుపతిలోని యూత్ హాస్టల్‌లో పోటీలు ఉంటాయని తెలిపారు. అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాససూరి మాట్లాడుతూ మహిళలకు విజయవాడలో ఈ నెల 18 నుంచి 21వ తేదీ వరకు తెలిపారు. అసోసియేషన్ నాయకులు శర్మ, కిరణ్, బాలాజీచౌదరి, అనిల్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు
పురుషుల విభాగంలో: యతిన్‌రెడ్డి, త్రిపురాంబికా, లతీష్‌రెడ్డి, పార్థసాయి
మహిళల విభాగంలో: మోడీతరెడ్డి, ఝాన్సీ, మహాలక్ష్మి, గురువాక్షిని

ఆనంద నిలయం వీడియో చిత్రీకరణ

తిరుమల: తిరుమలలో ఆనంద నిలయాన్ని వీడియో చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకుంటామని సీవీఎస్వో నరసింహ కిషోర్ సోమవారం తెలిపారు. టీటీడీ నిబంధనల ప్రకారం శ్రీవారి ఆలయంలోకి ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకెళ్లడం, వీడియో చిత్రీకరించ డం నేరమన్నారు. అయితే ఆదివా రం రాత్రి తిరుమలలో భారీ వర్షం కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో ఆ సమయంలోనే సదరు భక్తుడు పెన్ కెమెరా ద్వారా వీడియో చిత్రీకరించినట్టు అనుమానిస్తున్నామన్నారు.

జిల్లావ్యాప్తంగా భారీ వర్షం

చిత్తూరు అగ్రికల్చర్: జిల్లావ్యాప్తంగా ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో పలుచోట్ల వాగులు వంకలు పొంగి పొర్లాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అత్యధికంగా ఎస్‌ఆర్ పురం మండలంలో 188.2 మిల్లీ మీటర్లు (18 సెంటీమీర్లు), అత్యల్పంగా విజయపురంలో 5.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే వెదురుకుప్పం 80.4, పెనుమూరు 73, పాలసముద్రం 52.2, కుప్పం 48, శాంతిపురం 40.2, గుడుపల్లె 38.2, కార్వేటినగరం 36.8, గంగాధరనెల్లూరు 35, రొంపిచెర్ల 33.4, ఐరాల 33, గుడిపాల 31, పులిచెర్ల 28, బంగారుపాళ్యం 27.2, రామకుప్పం 24.2, చిత్తూరు 22.2, గంగవరం 19.6, చౌడేపల్లె, యాదమరి 19.4, వి.కోట 19.2, సోమల 18.6, తవణంపల్లె, సదుం 18.4, పలమనేరు 17, బైరెడ్డిపల్లె 16.2 నగరి 11.2, పుంగనూరు 12.2, పూతలపట్టు 11.2, పెద్దపంజాణిలో 10.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.


ఉడమల కృత్తి వద్ద వ కొట్టుకు పోయిన కల్వర్టు

● వాన..వరద

జీడీ నెల్లూరు నియోజకవర్గంలో ఆదివారం సాయంత్రకం నుంచి రాత్రి 10గంటల వరకు భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు.. వంకలు ఉప్పొంగాయి. పంట పొలాలు నీట మునిగాయి. కృష్ణాపురం జలాశయానికి వరద నీరు చేరింది. పాతపాళ్యం, కుశస్థలి ఉధృతంగా ప్రవహించడంతో ఉడమలకృత్తికి వెళ్లే మార్గంతోపాటు, జీఎంఆర్‌పురం వద్ద కల్వర్టులు ధ్వంసమయ్యాయి. ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మొక్కల చెరువు, దేవళం చెరువులో చేపలు కొట్టుకుపోయాయి. పలుచోట్ల రహదారులు దెబ్బతిన్నాయి. సమాచారం అందుకున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి వెంటనే అధికారులను అప్రమత్తం చేశారు. పంట నష్టం అంచనాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. –కార్వేటినగరం


జీఎంఆర్ పురం వద్ద ధ్వంసమైన కల్వర్టులను పరిశీలిస్తున్న అధికారులు